జననేత రాకతో పులకింత

- హెలీప్యాడ్ వద్ద సీఎంకు స్వాగతం పలికిన మంత్రులు, ఎమ్మెల్యే కొడాలి నాని, ప్రజాప్రతినిధులు, అధికారులు
- హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు పూలవర్షం కురిపించిన అభిమానులు
- తరలివచ్చిన మహిళాలోకం





గుడివాడ టిడ్కో ఇళ్ల నమూనాను సీఎంకు అందజేస్తున్న పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, వేదికపై ప్రజాప్రతినిధులు, అధికారులు

గుడివాడరూరల్: టిడ్కో ఇళ్ల పంపిణీకి శుక్రవారం గుడివాడ విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఘన స్వాగతం పలికారు. హెలీప్యాడ్ వద్ద నుంచి బహిరంగ సభ ఏర్పాటు చేసిన ప్రాంగణం వరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పూలవర్షంతో స్వాగతం పలికారు. కాగా ఇళ్ల పరిశీలన అనంతరం బహిరంగ సభ వద్దకు చేరుకునే సమయంలో సీఎం ప్రజలకు అభివాదనం చేసుకుంటూ స్టేజ్ వద్దకు చేరుకున్నారు. తొలుత తాడేపల్లి వద్ద నుంచి గుడివాడ మల్లాయపాలెం వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద హెలీకాప్టర్ దిగిన ముఖ్యమంత్రికి పలువురు ఘన స్వాగతం పలికారు. మంత్రులు, ఉన్నతాధికారులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, తహసీల్దార్ కె.ఆంజనేయులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, రాష్ట్ర ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

తరలివచ్చిన మహిళాలోకం..

గుడివాడలో టిడ్కో ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు గుడివాడ నియోజకవర్గంతో పాటు పలు నియోజకవర్గాలు, జిల్లావ్యాప్తంగా భారీగా మహిళలు తరలివచ్చారు. మహిళలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, యువత జగన్‌మోహన్‌రెడ్డి సభాప్రాంగాణానికి చేరుకోగానే నినాదాలు పలికారు. ముఖ్యమంత్రి కూడా పార్టీ నాయకులను, ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులతో ఆప్యాయంగా పలకరించి వారితో కొంతసేపు ముచ్చటించారు.

దారిలో కనిపించిన దివ్యాంగుడు మోహన్‌రెడ్డితో ముఖ్యమంత్రి కిందకూర్చుకుని సెల్ఫీ దిగారు. దీంతో అక్కడ ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు కేరింతలు కొట్టారు. గృహప్రవేశాలు చేసిన, ఇళ్లస్థలాలు తీసుకున్న పలువురు మహిళలు తమ ఆనందాన్ని వెల్లడించారు.

కల నెరవేరింది..



గత ప్రభుత్వంలో ఇల్లు కావాలని తిరిగితే కాళ్లకు ఉన్న చెప్పులు అరగటమే తప్ప పని అయ్యేదే కాదు. జగన్ ప్రభుత్వం వచ్చాక అలాంటి పరిస్థితులు లేకుండా పోయాయి. ఇంటికే అన్ని పథకాలు వచ్చేస్తున్నాయి. ఆ పథకాల్లో భాగంగానే మాకు సొంతింటి కల కూడా నెరవేరింది.

–గొర్జెల్ల నాగమణి, లబ్ధిదారురాలు

చాలా ఆనందంగా ఉంది..



సొంతిల్లు కావాలని ఏ కుటుంబానికి కోరిక ఉండదు. కాని గతంలో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయింది. చాలా మంది నాయకులు, అధికారుల దగ్గరకు తిరిగినా ఫలితం దక్కలేదు. మేము ఊహించని విధంగా ఇంటింటికీ వచ్చే వలంటీర్లే ఈ సారి మాకు ఇల్లు వచ్చినట్లుగా చెప్పారు.

–సత్తా కల్పన, లబ్ధిదారురాలు

జగన్ మా ఇంటి సభ్యుడే..



సీఎం వై.ఎస్.జగన్ మా ఇంటి చిరకాల స్వప్నం నెరవేర్చి మా ఇంటి సభ్యుడయ్యాడు. సొంతిల్లు మాకు ఇప్పుడూ కలగానే ఉంటుందని అనుకున్నాం. ఒక్క జగన్ ప్రభుత్వంలోనే నెరవేరింది. ఇళ్లకు అద్దెలు కట్టుకోలేక ఇబ్బందులు పడేవాళ్లం. సొంతింటితో ఆ బాధలు అన్నీ తీరాయి.

–మద్దాల దేవమణి, లబ్ధిదారురాలు

జనం గుండెల్లో నిలిచిపోతారు..



టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి కొడాలి నాని మా గుడివాడ ప్రజలకు ఇళ్లను ఏర్పాటు చేసేందుకు పాదయాత్ర కూడా చేశారు. కానీ ఇప్పుడు అది ఒక్క జగన్ ప్రభుత్వంలోనే నెరవేరింది. మాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు ఇళ్లను కల్పిస్తున్న జగన్ జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు.

–బొల్లవరపు సుగుణ, లబ్ధిదారు

ముఖ్యమంత్రి సభ విజయవంతం



సభకు హాజరైన జనంలో ఒక భాగం

గుడివాడ టౌన్: పది వేల మందికి పైబడి నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆలోచన కార్యరూపం దాల్చింది. 8,912 టిడ్కో గృహాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేసేందుకు శుక్రవారం జరిగిన బహిరంగ సభ విజయవంతం అయింది. ప్రతిపక్షాల ఆరోపణలు, పుకార్లు, అపనమ్మకపు ప్రచారాలను పటాపంచలు చేస్తూ వేల సంఖ్యలో ప్రజలు సభకు హాజరయ్యారు.

ఎండను సైతం లెక్కచేయకుండా..

గుడివాడ అర్బన్, రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రత ఎండను కూడా లెక్క చేయకుండా సభకు హాజరవ్వడం జగన్ మోహనరెడ్డి, కొడాలి నానిపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి అద్దంపట్టింది. సభకు విచ్చేస్తున్న ప్రజలకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సకల ఏర్పాట్లు చేశారు. పట్టణంలో దారి పొడవునా ప్రతి అర కిలోమీటరుకు ఒకచోట మంచినీరు, మజ్జిగ, నిమ్మరసం కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం అల్పాహారం నుంచి మధ్యాహ్న భోజనం వరకు బస్సుల వద్ద ఏర్పాటు చేయడంతో కార్యకర్తలు, ప్రజలు ఇబ్బందులు పడకుండా గృహాలకు చేరారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా..

సభాస్థలంలో ప్రతి గ్యాలరీలోనూ తాగునీటి బాటిళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. ముఖ్యమంత్రి సభకు సుమారు 50 వేలకు పైబడి ప్రజలు హాజరై క్షేమంగా ఇంటికి చేరడం నేటి ముఖ్యమంత్రి సభకు హైలెట్. ముఖ్యమంత్రి సభకు విచ్చేస్తున్న సమయంలో తొలుత టిడ్కో ఇళ్లలో గృహ ప్రవేశం చేసిన అక్కాచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. వారిని అభినందించి ఆడపడుచులుగా చీర, సారె ఇచ్చారు. అనంతరం లబ్ధిదారులతో ముచ్చటించి టిడ్కో ఇళ్ల ఏర్పాట్లపై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇళ్ల నిర్మాణానికి వినియోగించిన 77.46 ఎకరాల భూమిని కొనుగోలు చేసిన దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 18 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.

శిలాఫలకాల ఆవిష్కరణ..

టిడ్కో గృహాలు, జగనన్న కాలనీల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇళ్ల నిర్మాణం, గుడివాడ రూరల్ మండలం, నందివాడ మండల గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరును అందించేందుకు రూ.106 కోట్లతో ఏర్పాటు చేయనున్న సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకం అమలు శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం సభాస్థలికి చేరుకున్న ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ ఎండ భగ్గున మండుతున్నా మీ బిడ్డను ఆశీర్వదించడానికి ఇక్కడకు విచ్చేసిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తహసీల్దార్ కె.ఆంజనేయులు, హౌసింగ్ డీఈలు రామోజీనాయక్, నిరీక్షణరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, మండలి హనుమంతరావు, ఎంపీ నారయణరెడ్డి, పాలడుగు రామ్ ప్రసాదు, పాలేటి చంటి, గొర్ల శ్రీను, నందివాడ మండల ఎంపీపీ పెయ్యల ఆదాం, రూరల్ ఎంపీపీ గద్దె పుష్పరాణి, జెడ్పీటీసీ జి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తే సహించం

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులపాటి రామచంద్రరావు

పమిడిముక్కల: పామర్రు నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకువెళుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌పై విపక్ష పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులపాటి రామచంద్రరావు అన్నారు. గురజాడ గ్రామంలో శుక్రవారం సర్పంచ్ జంపాన వీర వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గురజాడ గ్రామ పరిధిలోని చెరువును పాటదారులు నిబంధనల మేరకు తవ్వకాలు జరుపుతుంటే కొందరు దురుద్దేశపూర్వకంగా అడ్డుకోవాలని ప్రయత్నించం సరికాదని రాజులపాటి అన్నారు. చెరువు పాట ద్వారా పంచాయితీకి లభించే ఆదాయంతో గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతాయని, రాజకీయ విబేధాలతో పంచాయతీ ఆదాయానికి గండికొద్దని విపక్ష పార్టీలకు సూచించారు. అవినీతి పనులతో డబ్బు సంపాదించాల్సిన అవసరం అనిల్‌కుమార్‌కు లేదని స్పష్టం చేశారు. గురజాడ సర్పంచ్ జంపాన వీర వెంకటేశ్వరరావు(చంటి) మాట్లాడుతూ అన్ని అనుమతులు తీసుకొని గ్రామంలో పూడుకుపోయిన చెరువును పూడిక తీస్తూ ఆమట్టిని గ్రామాభివృద్ధికి ఉపయోగిస్తుంటే టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార రాజా అక్రమ మట్టి తవ్వకాలు చేస్తున్నారని అనడం ఎంతవరకు సబబన్నారు. గత టీడీపీ పాలనలో నీరు–చెట్టు పథకం కింద టీడీపీ నాయకులంతా మట్టిని మింగేశారని విమర్శించారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పారదర్శకంగా పాలన సాగిస్తున్నారని అన్నారు. సమావేశంలో సర్పంచ్ జంపాన వీర వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ జంపాన శ్రీనివాసగౌడ్, ఉపసర్పంచ్ షూకూర్‌ఖాన్, వార్డు సభ్యులు రహమత్‌ఖాన్, మాతాప్రియ, రాజులపాటి రాధకృష్ణ, కృష్ణవేణి, నాగరాజు, పార్టీ నాయకులు రాజులపాటి గురవయ్య, కాండ్రు దయాకర్‌బాబు, జంపాన పుండరీకాక్షయ్య, పోతురాజు, అశోక్, రజియాబేగం, మోజస్ తదితరులు పాల్గొన్నారు.

83 మందికి పట్టాల పంపిణీ



గ్రీన్ విలేజ్‌లో పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు: నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ నివేశన స్థలాలు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. స్థానిక జగనన్న గ్రీన్ విలేజ్‌లో రెండో విడత 83 మంది మహిళలకు ఇంటి పట్టాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు అందరు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఆర్థిక స్తోమత లేనివారికి ఆర్త నిర్మాణ సంస్థ ద్వారా తక్కువ ఖర్చుతో ఇంటి నిర్మానం పూర్తి చేసుకోవాలని సూచించారు.

సహకార బ్యాంకుల ద్వారా నిర్మాణదారులకు రూ.2 లక్షల వ్యక్తిగత రుణం మంజూరు చేస్తామన్నారు. ఇంత మంచి మేలు చేస్తోన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ అడివి కృష్ణ, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ సేవదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, ఎంపీటీసీ సభ్యులు మంగినేని రామకృష్ణ, మూడేడ్ల శశికళ, వార్డు సభ్యులు సమతం శ్రీనివాసరావు, బుద్ధా మహాలక్ష్మీ, పిచ్చుకల రమ్య, నాయకులు ముంగర గోపాలకృష్ణ, జాన్ విక్టర్, నిమ్మల శ్రీనివాసరావు, మూడేడ్ల గౌరి నాయుడు, సాన శ్రీను, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో సీతారాం పాల్గొన్నారు.

సమన్వయంతో సమగ్రాభివృద్ధి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాము

కైకలూరు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధిని సాధించాలని కైకలూరు మండల ప్రత్యేకాధికారి, ఏలూరు జిల్లా డ్వామా పీడీ అరసపల్లి రాము చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఏలూరు జిల్లా ట్రైనీ కలెక్టరు అపూర్వ భరత్ సమీక్ష పాల్గొని సూచనలు చేశారు. అనంతరం ప్రత్యేకాధికారి రాము మాట్లాడుతూ నిర్దేశించిన సమయానికి ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. నాడు–నేడు పనులను వేగవంతం చేయాలన్నారు. త్వరలో జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. శాఖల పనితీరును సమీక్షించారు. ఎంపీడీవో కె.రామలింగేశ్వరరావు, తహసీల్దారు బి.మురళీకృష్ణ, హౌసింగ్ ఏఈ రమణమూర్తి, పీఆర్ డీఈ సురేష్, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీపై అవగాహన



ఇంగిలిపాకలంక అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మండవల్లి: జన భాగీదారీ కార్యక్రమంలో చిన్నారులను భాగస్వామ్యం చేసేలా వారిని ప్రోత్సహించాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ కల్పవల్లి అన్నారు. మండవల్లి అంగన్‌వాడీ కేంద్రం–4లో చిన్నారుల తల్లిదుండ్రులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ మెండా ఝాన్సి, ఇంగిలిపాకలంక అంగన్‌వాడీ కేంద్రంలో జెడ్పీటీసీ ముంగర విజయ నిర్మల, సర్పంచ్ ఘంటసాల రత్నకుమారి పాల్గొన్నారు.

కుర్చీల వితరణ..

మండవల్లి అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన స్థానిక వార్డు సభ్యులు బొమ్మనబోయిన నాగస్వాతి రాజేష్ శుక్రవారం 6 కుర్చీలు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా స్వాతి రాజేష్ దంపతులను సూపర్‌వైజర్ కల్పవల్లి, కార్యకర్తలు, గర్భిణులు

ఆత్మీయ స్వాగతం









టిడ్కో ఇళ్లు పంపిణీకి శుక్రవారం గుడివాడ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పలువు రు స్వాగతం పలికారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికరాము, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యేలు కొడాలి నాని, డీఎన్నార్, కైలే అనిల్ కుమార్, మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. సీఎం వైఎస్ జగన్ వారిని ఆప్యాయంగా పలుకరించారు.

– గుడివాడ టౌన్

19న ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికి ప్రవేశం కోసం ఈ నెల 19వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కేబీఆర్ ప్రభుత్వ భాగస్వామ్య శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ గొంది హరిధర్మేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీ ఉదయం 9 గంటలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు అడ్మిషన్లు నిర్వహించబడతాయన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఇతరులు రూ.60 కాషన్ డిపాజిట్ చెల్లించాలి. ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో చేరే అభ్యర్థులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజులు ఉంటాయి. వివరాలకు 08674–245953, 8297574757 నంబర్లను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష మల్లెల అర్చన



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారికి జ్యేష్ఠ మాసం సందర్భంగా లక్ష మల్లెల అర్చనను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు విశేషాభిషేకాలు, హోమాలను చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శేషం గోపి, ఈఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి



పెదపారుపూడి: స్థానిక అంగన్‌వాడీ సెంటర్‌ల్లో 'అంగన్‌వాడీ పిలుస్తుంది' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. శివనాగమణి మాట్లాడుతూ మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలు అందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. చిన్నారులను ఇంటి వద్ద ఉంచకుండా అంగన్‌వాడీ సెంటర్‌కు పంపిస్తే ఆట పాటల ద్వారా చదువు నేర్పిస్తామన్నారు. పిల్లల మేధస్సుకు తగినట్టుగా ప్రీ స్కూల్ మెటీరియల్, సిలబస్ పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. చిన్నారులకు మెనూ ప్రకారం ఒక పూట భోజనం అందిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి రోజూ పాలు గుడ్డు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలు ప్రారంభం



గుడివాడ టౌన్: స్థానిక కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2023–24 సంవత్సరానికి అడ్మిషన్లకు కౌన్సెలింగ్ శుక్రవారం ప్రారంభించారు. మెరిట్ ఆధారంగా తొలిసీటును జి.శ్రీసాయి పవన్‌కు ఎలక్ట్రికల్ ట్రేడ్‌లో కేటాయించారు. మొత్తం 91 మందికి గాను 40 మంది ఇంటర్వ్యూకు హాజరు కాగా 26 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.హరిధర్మేంద్ర తెలిపారు.

నేడు అవార్డు ప్రదానం




ముదినేపల్లి రూరల్: జగనన్న ఆణిముత్యాలు అవార్డుకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని బడుగు శ్రావణి ఎంపికైంది. నియోజకవర్గస్థాయి అవార్డుకు శ్రావణి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం.జాస్మిన్ శుక్రవారం తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో హెచ్ఈసీ గ్రూపులో 839 మార్కులు సాధించి నియోజకవర్గస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచినట్లు తెలిపారు. కైకలూరులో శనివారం నిర్వహించే కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు శ్రావణికి రూ.15 వేలు, ప్రశంసాపత్రం అందించడంతో పాటు శ్రావణి తల్లిదండ్రులను సత్కరిస్తారని చెప్పారు. ఈ అవార్డుకు ఎంపికైన శ్రావణిని ప్రిన్సిపాల్, హిస్టరీ అధ్యాపకురాలు ఆర్.జానకీదేవీ ఇతర అధ్యాపకులు అభినందించారు.

నీటి ట్యాంకర్ బహూకరణ



కైకలూరు(కలిదిండి): తపన పౌండేషన్ అధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి రూ.2.80 లక్షల విలువ కలిగిన వాటర్ ట్యాంకర్‌ను కలిదిండి మండల ప్రజల సౌకర్యార్థం సీతారామపుర అగ్రహారం గ్రామంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గారపాటి మాట్లాడుతూ 2008 నుంచి తపన ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 20 మంచినీటి ట్యాంకర్లతో సేవలు అందిస్తున్నామన్నారు. సర్పంచ్ పరసా వెంకటస్వామి, ఎంపీటీసీ కట్టా వెంకటేశ్వరమ్మ, పెరుమాళ్ళ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పథకాలపై సమీక్ష



మండవల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం కార్యాచరణ నిర్ణయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ టీకే వెంకటరమణ అధ్యక్షత వహించారు. సమావేశంలో ×జగనన్న సురక్ష₹ పథకంపై సభల నిర్వహణ, ×జగనన్నకు చెబుదాం₹ వంటి పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీడీఓ, విద్యుత్‌శాఖ ఏఈ, తహసీల్దార్ కె. రాజ్‌కుమార్, ఈఓపీఆర్డీ బి.ఆనందబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో చర్చించారు.

బాబాకు ప్రత్యేక పూజలు



మండవల్లి: మండవల్లిలోని షిర్డీసాయిబాబా 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడివాడకు చెందిన శ్రీసాయి శ్రీపాద వల్లభ ధార్మిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుంటుముక్కల నిర్మలాదేవి ఆధ్వర్యంలో సత్సంగ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం 13వ ఆలయ వార్షిక మహోత్సవం, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు తెలిపారు.

జగనన్న ఆణిముత్యం సర్టిఫికెట్ల పంపిణీ



మండవల్లి: మండవల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు సర్పంచ్ మెండా ఝాన్సి, హెచ్ఎం పీఎస్ఎస్‌జీ ప్రసాద్, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యుల సమక్షంలో ప్రథమ స్థానం సంపాదించిన సీహెచ్ యువసాయి ప్రదీప్, ద్వితీయ స్థానం సాధించిన జి. కుసుమ, తృతీయ స్థానం సంపాదించిన జి.జగదీష్‌కు జగనన్న ఆణిముత్యం సర్టిఫికెట్స్, మెడల్స్ బహూకరించారు.

వైభవంగా శాంతికల్యాణం



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శాంతి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన కృత్తికా నక్షత్రం సందర్భంగా ఈ కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో కల్యాణతంతు నిర్వహించారు. పలువురు దంపతులు ఈ కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

లోడిదిలంకలో ఇల్లు దగ్ధం

కైకలూరు(కలిదిండి): విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా కలిదిండి మండలం లోడిదిలంక గ్రామంలో రెండు నిట్టాడ తాటాకు ఇల్లు శుక్రవారం దగ్ధమయ్యింది. గ్రామానికి చెందిన టి.చిన్నశ్రీనివాసరావు కుటుంబంతో నివాసముంటున్నాడు. మంటలు వ్యాపించడంతో కైకలూరు అగ్నిమాపక కేంద్రానికి స్థానికులు ఫోన్ చేయడంతో ఫైర్ ఆఫీసరు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఫైర్ ఆఫీసరు మాట్లాడుతూ రూ.లక్షా 50 వేలు ఆస్తి నష్టం జరిగిందన్నారు. దాదాపు రూ.3.50 లక్షల ఆస్తిని రక్షించామన్నారు. ఫైర్ సిబ్బంది రామభాస్కర్, రవీంద్రబాబు, గణేష్, మురళీ పాల్గొన్నారు.

రేకుల షెడ్డు దగ్ధం

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రులో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో రేకులషెడ్డు దగ్ధమైంది. గ్రామానికి చెందిన వి.రాజారావు కుటుంబ సభ్యులంతా ఉదయం పొలం పనులకు వెళ్లారు. ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో మంటలు చెలరేగడంతో స్థానికులు గమనించి అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో షెడ్డుతో పాటు గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి.